# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్, మారిషస్ దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలు ఈరోజు వారణాసి వేదికగా జరిగాయి.
- ❖ దేశంలోని ఐదు విమాశ్రయాలలో ఫాస్ట్ ట్రాక్ ఇమ్మిగ్రేషన్ సౌకర్యాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించారు.
- ❖ ఉత్తరాఖండ్ రాష్ట్రానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ 1200 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.
- ❖ భారత నూతన ఉపరాష్ట్రపతిగా సీ పీ రాధాకృష్ణన్ రేపు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, మారిషస్ దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలు ఈరోజు వారణాసి వేదికగా జరిగాయి. మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గులం భారత ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య నాలుగు కీలక అవగాహన ఒప్పందాలు కుదిరాయి. అనంతరం ఏర్పాటు చేసిన ఉమ్మడి మీడియా సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ... భారత్, మారిషస్ పేరుకి రెండు దేశాలే కానీ వాటి కలలు, గమ్యాలు మాత్రం ఒకటేనని పేర్కొన్నారు. మారిషస్ ప్రత్యేక ఆర్థిక మండలి భద్రత, సముద్ర సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి భారత్ కట్టుబడి ఉందని తెలిపారు. స్థానిక కరెన్సీలో వాణిజ్యం చేసేందుకు ఇరుదేశాలు నిర్ణయించాయని చెప్పారు. భారత్ వెలుపల మొట్టమొదటి జన ఔషధి కేంద్రం మారిషస్‌లోనే స్థాపించబడిందని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

అదేవిధంగా మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గులం మాట్లాడుతూ... ఈ పర్యటనలో ఇరు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు సమగ్ర కార్యాచరణపై చర్చించామని అందుకు తగిన పలు కీలక నిర్ణయాలను తీసుకున్నామని ఆయన వెల్లడించారు.

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈరోజు ఫాస్ట్ ట్రాక్ ఇమ్మిగ్రేషన్ ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రామ్ ను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. లక్నో, తిరువనంతపురం, తిరుచ్చి, కాలికట్, అమృత్‌సర్ విమానాశ్రయాల్లో ఈ సౌకర్యం అమలుకానుంది. ఇది ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేయనుంది. ఇది ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ ప్రక్రియలో మానవ జోక్యాన్ని తగ్గిస్తుంది. దీనిని గత సంవత్సరం ఢిల్లీలో ప్రారంభించగా, ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 13 విమానాశ్రయాలలో ఈ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇటీవల వరదలు, కొండ చరియలు విరిగి పడిన ఘటనలతో తీవ్రంగా నష్టపోయిన ఉత్తరాఖండ్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 1200 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఉత్తరాఖండ్ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన ఆస్తి నష్టంపై ఈరోజు ఆయన ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ విపత్తు నుండి ప్రజలు కోలుకోవడానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లను పునర్నిర్మించడం, జాతీయ రహదారులను, పాఠశాలలను పునరుద్ధరించడం చేస్తామని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ కు మహారాష్ట్ర గవర్నర్ గా అదనపు బాధ్యతలు అప్పగించారు. భారత ఉపరాష్ట్రపతిగా సి.పి.రాధాకృష్ణన్ ఇటీవల ఎన్నిక అవ్వడంతో మహారాష్ట్ర గవర్నర్ పదవికి ఆయన రాజీనామా చేశారు. దీంతో ఆచార్య దేవవ్రత్ కు ఈ అదనపు బాధ్యతలు అప్పగించినట్లు రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. మరో వైపు భారత నూతన ఉపరాష్ట్రపతిగా సీ పీ రాధాకృష్ణన్ రేపు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొద్ది సేపటి క్రితం ఢిల్లీకి పయనమయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భావితరం వస్తు సేవల పన్ను (జీఎస్టి) సంస్కరణల ద్వారా ప్రభుత్వం ఆటోమొబైల్ రంగానికి గణనీయమైన ఉపశమనం కల్పించింది. 350 సీసీ కంటే తక్కువ ఇంజిన్ సామర్థ్యం కలిగిన ద్విచక్ర వాహనాలపై జీఎస్టిని 28 శాతం నుండి 18 శాతానికి తగ్గించింది. అదేవిధంగా బస్సులు, ట్రక్కులు, త్రీ-వీలర్స్ వంటి వాణిజ్య వాహనాలపై కూడా పన్నుల శాతాన్ని 18 కి తగ్గించింది. ఇక ఎలక్ట్రిక్ వాహనాలు 5 శాతం పన్నుల శ్లాబ్ పరిధిలో ప్రయోజనం పొందుతూనే ఉన్నాయి. ఆటోమొబైల్ పరిశ్రమ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోంది. వివిధ రంగాలలో 3.5 కోట్లకు పైగా ఉద్యోగాలకు ప్రత్యక్షంగానూ పరోక్షంగా మద్దతు నిస్తోంది. ఈ సంస్కరణలు వాహన ధరలను తగ్గించడమే కాకుండా డిమాండ్‌ను పెంచుతాయి.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నేపాల్‌లో కొనసాగుతున్న రాజకీయ గందరగోళం మధ్య తాత్కాలిక ప్రభుత్వ నాయకత్వాన్ని నిర్ణయించడానికి ఆ దేశ అధ్యక్షుడు రామ్ చంద్ర పౌడెల్, నేపాల్ ఆర్మీ చీఫ్ అశోకరాజ్ సిగ్డెల్ జెన్‌జీ ప్రతినిధులతో ఈరోజు చర్చలు జరిపారు. జెన్‌జీ ప్రతినిధులు మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కర్కిని తాత్కాలిక ప్రధానమంత్రి పదవికి ఏకైక నామినీగా ఖరారు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా సోమవారం జరిగిన నిరసనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 30కి చేరగా వివిధ ఆసుపత్రులలో 1100 మందికి పైగా చికిత్స పొందుతున్నారు. మరోవైపు నేపాల్ సైన్యం దేశ వ్యాప్తంగా ఖర్ఫ్యూని రేపు ఉదయం వరకూ పొడిగించింది.

=======================

ఆర్మీ, నేవీ, వైమానిక దళానికి చెందిన 10 మంది మహిళా అధికారులతో కూడిన మొట్టమొదటి త్రివిధ దళాల సేవల సిబ్బంది 'సముద్రి ప్రదక్షిణ' యాత్రను రాజ్‌నాథ్ సింగ్ వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మిషన్ ఆకాశం ఎత్తుల నుండి మహాసముద్రాల లోతు వరకు ప్రతి రంగంలో భారతదేశం సాధించిన పురోగతికి నిదర్శనమని పేర్కొన్నారు. దీనిని భవిష్యత్ తరాలు గర్వంగా గుర్తుంచుకుంటాయని ఆయన మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

దుబాయ్‌లో ఈనెల 14న జరగనున్న భారత్-పాకిస్తాన్ ఆసియా కప్ టీ20 క్రికెట్ మ్యాచ్‌ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు ఈరోజు నిరాకరించింది. జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం ఈ విషయాన్ని అత్యవసరంగా జాబితా చేయడానికి నిరాకరించింది. మ్యాచ్ కొనసాగాలని పునరుద్ఘాటించింది.

=======================

దేశంలోనే మొట్ట మొదటి క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీ కేంద్రాన్ని అమరావతిలో ఏర్పాటు చేయబోతున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. 40 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో స్థాపించబోయే ఈ ఫెసిలిటీ కేంద్రంలో క్వాంటమ్ భాగాల పరీక్ష, బెంచ్ మార్కింగ్ మొదలగు సదుపాయాలను సమకూర్చనుంది. దీంతో భవిష్యత్‌లో అమరావతి నుంచే క్వాంటమ్ కంప్యూటర్‌ల తయారీకి ఇది పునాదిగా నిలవనుంది.

=======================

దేశంలో రానున్న 4-5 రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పేర్కొంది. నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపురతో సహా ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, బీహార్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలలో రాబోయే రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది.

=======================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప లాభాల్లో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 81,425 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరకు 123 పాయింట్లు లాభపడి 81,548 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 32 పాయింట్లు పెరిగి 25,005 వద్ద ముగిసింది. రూపాయి మారకం విలువ డాలర్‌తో పోలిస్తే 33 పైసలు తగ్గి 88 రూపాయల 44 పైసలుగా ఉంది.

=======================
=======================